క్లుప్తంగా

ఇంటర్‌లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో అమరావతి రోడ్డులోని సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జి.విమలమేరీ, కరస్పాండెంట్ సిస్టర్ అమలమేరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ బైపీసీలో జి.అమృత 433, ఎంపీసీలో షేక్ సాఫియా 456, సీఈసీలో పి.నాగ వర్షిత 468, ఎంఈసీలో పి.హెప్సిబా 457, సీనియర్ ఎంపీసీలో వి.చాతుర్య 977, బైపీసీలో షేక్ మీరాబీ 955, సీఈసీలో జి.నికిత 954 మార్కులు సాధించినట్లు తెలిపారు. అతి తక్కువ ఫీజులు, ఉత్తమ క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాస లక్ష్యంగా సాధారణ విద్యార్థినులతో అత్యుత్తమ ఫలితాలను సాధించామని తెలిపారు.

జీజీహెచ్‌లో చలివేంద్రం ప్రారంభం

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రారంభించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చలివేంద్రాన్ని మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్ఫూర్తితో పొరుగువారికి సేవలందిస్తూ అందరిని సమానంగా చూస్తూ ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ బత్తుల వెంకటసతీష్‌కుమార్, మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ సెక్రటరీ నాగరాజు, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు కిరణ్మయి, గంగమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

నెహ్రూనగర్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి లోన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ శాఖ ఈడీ దుర్గాబాయి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాలో 990 లబ్ధిదారులకు రూ.41.33 కోట్ల ఆర్థిక సాయం లక్ష్యంగా కేటాయించడం జరిగిందన్నారు. 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గలవారై రేషన్ కార్డు కలిగిన వారు అర్హులన్నారు. ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్ ఉపాధి లోన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక కోబాల్డుపేట ఏడో వీధిలోని శ్రీపోతురాజు సహిత శ్రీపోలేరమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద నిర్వహిస్తున్న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సుప్రభాతసేవ, పంచామృతాలతో విశేష స్నపన, అలంకార పూజ, అర్చన కార్యక్రమాలను ఆలయ అర్చకులు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు కలుకూరి బాలాజీ, దేవతోటి నాగరాజు పాల్గొన్నారు.

'హార్మోన్స్ సమస్యను నిర్లక్ష్యం చేయవద్దు



గుంటూరు మెడికల్: హార్మోన్స్ వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని ఎండ్రోకెనాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకట సందీప్ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో ఉచిత వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవతా స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ మధుమేహం, థైరాయిడ్, హార్మోన్ సమస్యలు ప్రస్తుతం ఎక్కువగా వస్తున్నాయన్నారు. ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోవడం, ఇన్సులిన్ సరిగా పనిచేయకపోవడంతో షుగర్ శాతం పెరుగుతోందన్నారు. దీన్ని మధుమేహంగా పిలుస్తారన్నారు. హార్మోన్లు ఉత్పత్తి అవుతాయని, వీటిలో హెచ్చు, తగ్గులు, ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయన్నారు. హార్మోన్‌లో పరిమాణం చాలా తక్కువే అయినా, శరీరంలోని అవయవాల జీవన ప్రక్రియలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. రక్తంలో హార్మోన్‌ల పరిమాణం పరీక్షించడం ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ అధ్యక్షుడు డాక్టర్ సేవాకుమార్, మేనేజర్ నిర్మలారాణి, మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డి.రమేష్, కె.సతీష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలే జగనన్న ఆశయాలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్



కౌన్సిల్ హాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు అనుసరణీయమని శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి స్పష్టం చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా గుజ్జనగుండ్ల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశం, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కారణంగా ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా విరాజిల్లుతున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ ఆలోచనా విధానమే మన దేశాన్ని ప్రపంచ దేశాలలోనే ఒక విభిన్న దేశంగా నిలబెట్టిందని అభిప్రాయపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అంబేడ్కర్ ఆలోచనలనే తన ఆశయాలుగా మలచుకుని ఆయన కలలుగన్న సమానత్వ సమాజ స్థాపన దిశగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అనంతరం 48వ డివిజన్ పరిధిలోని రెడ్డిపాలెంలోని మదర్ థెరిస్సా కాలనీలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జయంతి వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బత్తుల దేవానంద్, నేతలు వాసిమళ్ళ విజయ్, భాగ్యారావు, సుశీలరావు, షఫి, ముత్యాల రాజు, పిల్లి మేరీ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, రాష్ట్ర యువజన విభాగం నేత నూనె ఉమామహేశ్వర రెడ్డి, లంకిరెడ్డి మనోహర్ రెడ్డి, దారా హేమ ప్రసాద్, మోజెస్, వేణు, బోరుగడ్డ రజిని, రాజు కొండా పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త అంబేడ్కర్

గుంటూరు ఎడ్యుకేషన్: రాజ్యాంగాన్ని లిఖించిన బీఆర్ అంబేడ్కర్ గొప్ప న్యాయవాది, ఆర్థికవేత్త, సంఘ సంస్కర్త అని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా డీఈఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి

లక్ష్మీపురం: భారత రాజ్యాంగ పరిరక్షణే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని లాడ్జి సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎంఏ చిష్టి, దండా లక్ష్మీనారాయణ, ఎల్.అరుణ, బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, నాయకులు బైరగాని శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, మహ్మద్ అబ్దుల్ సలీం, గోనె లూథర్ పాల్, ఆది నికల్సన్, షేక్ ఖాసిం షహిద్, మస్తాన్ వలీ, కె రాంబాబు, జి పవన్, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

నెహ్రూనగర్: అంబేడ్కర్ తన జీవితాంతం బడుగు, బలహీన వర్గాలకు సమాజంలో గుర్తింపు, అభివృద్ధికి విశేష కృషి చేశారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ముందుగా గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి, అనంతరం లాడ్జి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని ఎక్కడ లేని విధంగా మన దేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయపడ్డారు.

బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్: బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య నగర్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు కూరపాటి సుబ్బారావు, గూడవల్లి మణి కుమారి పాల్గొన్నారు.



డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



నివాళులర్పిస్తున్న జేకేఆర్ డైరెక్టర్లు



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తి వై.నాగరాజా



అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేస్తున్న మాలమహానాడు నాయకులు

న్యాయశాఖ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా కోర్టులో న్యాయశాఖ అసోసియేషన్ హాల్‌లో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రెండో అదనపు, సెషన్ జడ్జి వై.నాగరాజా, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ తుపాటి శ్రీను, స్టేట్ జనరల్ సెక్రెటరీ పి.రాజగోపాల్, టౌన్ ప్రెసిడెంట్ లక్ష్మీ నాయక్, క్లాస్ ఫోర్ స్టేట్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్: బీజేపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. లాడ్జి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి మకుటం శివ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వైవీ సుబ్బారావు, ఉపాధ్యక్షురాలు మంత్రి సుగుణ, బజరంగ్ రామకృష్ణ, వెలగలేటి గంగాధర్, మోతే శేషగిరిరావు, వక్కలగడ్డ తిరుమలరావు, మలిశెట్టి పవన్, పెద్దింటి కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీజేలు, తీన్‌మార్ చప్పుళ్ళతో లాడ్జిసెంటర్ కూడలి కోలాహలంగా మారింది. భీమ్ సేన సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు నేలపాటి నాగభూషణం ఆధ్వర్యంలో లాడ్జిసెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ ప్రతిమ అందరిని ఆకట్టుకుంది. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని లాడ్జిసెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, మల్లేశ్వరరావు, నిమ్మల శేషయ్య, కోలా అశోక్, రామకృష్ణ, కొల్లూరి హనుమంతరావు పాల్గొన్నారు. బహుజన మహాసభ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ అధ్యక్షుడు ఏసుబాబు ఆధ్వర్యంలో నగరంలోని సంఘ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత, బహుజనుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ హాజరై అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నల్లపు నీలాంబరం, చుక్కా దేవరాజు, బండ్లమూడి స్టాలిన్‌బాబు, చిలకా డేవిడ్, బత్తుల అనిల్, మంచాల జోసెఫ్, కనకపల్లి వినయ్, చిన్నం డేవిడ్ విలియమ్స్ పాల్గొన్నారు.

పాతగుంటూరులో..

మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్సాక్ ఆధ్వర్యంలో పాతగుంటూరులోని క్రిస్టియన్ పేటలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో.. అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో సంఘ నాయకులు సునిల్ కుమార్, ప్రకాష్, కోటిరత్నం, చంద్రనాయక్, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వై.నేతాజి



బీసీ సంక్షేమ సంఘం నాయకులు..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: బాబాసాహెబ్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి అన్నారు. గుంటూరులో పలు డివిజన్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రత్తయ్య, మోషే, ఎస్ఎస్ఈ జిల్లా అధ్యక్షుడు కరీం పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదిగి, దేశాన్ని ముందుకు నడిపించాలని జీకేఆర్ హైస్కూల్ డైరెక్టర్లు జి.కొండారెడ్డి, జనార్థన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జీకేఆర్ హైస్కూల్ పట్టాభిపురం, ఏటీ అగ్రహారం క్యాంపస్‌లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అధ్యయనం చేస్తే విశ్వజనీయ జ్ఞానం

కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ రమేష్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ రమేష్

ఏఎన్‌యూ: అంబేడ్కర్‌ను, ఆయన సిద్ధాంతాలను అధ్యయనం చేయడం ద్వారా విశ్వజనీయ విజ్ఞానం పొందుతారని కాకతీయ యూనివర్సిటీ(వరంగల్) మాజీ వీసీ ఆచార్య టి.రమేష్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో ఆచార్య రమేష్ ప్రసంగిస్తూ భారతీయ సమాజం సంపూర్ణంగా సాధికారిత, సమానత్వం సాధించేందుకు దోహదం చేసే అన్ని అంశాలను అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. కానీ అంబేడ్కర్ ఆశించినట్లుగా భారత రాజ్యాంగ లక్ష్యాలు పూర్తిగా నేటికీ నెరవేరలేదని పేర్కొన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలను నేటి సమాజానికి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత విద్యార్థులపై అధికంగా ఉంటుందన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె గంగాధరరావు ప్రసంగిస్తూ అంబేడ్కర్‌ను నేటికీ ఇంత ఘనంగా స్మరించుకుంటున్నామంటే ఆయన మేధ, దార్శనికతే కారణమన్నారు. అంబేడ్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ వై.అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. హైకోర్టు న్యాయవాది డాక్టర్ మద్దు అంకయ్య, ప్రిన్సిపాల్స్ ఎం.సురేష్ కుమార్, పీపీఎస్ పాల్ కుమార్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.త్రిమూర్తిరావు, అధికారులు పి.బ్రహ్మాజీరావు, మల్లికార్జున, డీఈ కె.సుబ్బారావు, సీఈ ఎ.శివప్రసాదరావు, పరీక్షల నోడల్ అధికారి ఆర్.ప్రకాశరావు, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్, ఆచార్య లింగరాజు ప్రసంగించారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో అందరూ నడవాలి



అంబేడ్కర్ చిత్రపటం పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. అంబేడ్కర్ జయంతి సోమవారం జీజీహెచ్‌లో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్‌కుమార్, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌లు గంగమ్మ, కిరణ్మయి, పలువురు గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్, మినిస్టీరియల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, ఇన్‌చార్జి సార్జంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగాభివృద్ధికి పునాదులు వేసిన అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: అత్యున్నత రాజ్యాంగం ద్వారా భారతదేశంలో విద్యాభివృద్ధికి బీఆర్ అంబేడ్కర్ బాటలు వేశారని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ జయంతి సందర్భంగా లాడ్జి సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్, నాయకులు జి వెంకటేశ్వర్లు, సీహెచ్ ఆదినారాయణ, బి.ప్రసాద్, ఎండీ షకీలాబేగం పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యాలయంలో..

కంకరగుంటలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతికిగా అంబేడ్కర్ అనుక్షణం వారి సంక్షేమం కోసం తపించారని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, ప్రముఖ వైద్యుడు ఆలా వెంకటేశ్వర్లు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వేలాంగిణిరాజు, కె.నరసింహారావు పాల్గొన్నారు.

70 ఏళ్ల వృద్ధురాలికి గుండె ఆపరేషన్

సిమ్స్– శిఖరలో చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ నాగశ్రీహరిత, పక్కన డాక్టర్ మావోటో హబారా, శివప్రసాద్

గుంటూరు మెడికల్: గతంలో ఒక సారి గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్న 70 ఏళ్ల వృద్ధురాలికి మళ్లీ గుండె సమస్య రావడంతో ఆధునిక చికిత్స పద్ధతుల్లో ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడినట్లు సిమ్స్–శిఖర హాస్పిటల్ కార్డియాక్ సైంటిస్ట్ డైరెక్టర్ డాక్టర్ పర్వతినేని నాగశ్రీహరిత చెప్పారు. సోమవారం గుంటూరు మంగళదాస్‌నగర్‌లోని సిమ్స్ - శిఖర హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో 70 ఏళ్ల వృద్ధురాలికి బైపాస్ సర్జరీ జరిగిన తరువాత ఎడమవైపు ప్రధాన ధమనిలో బ్లాక్ ఏర్పడిందన్నారు. తమ వద్దకు చికిత్స కోసం రాగా, అధునాత ఇంట్రావాక్యూలర్ ఉపయోగించి సమస్య తెలుసుకుని ప్రత్యేక బెలూన్లు, స్టంట్‌ల సహాయంతో విజయవంతంగా ధమనిలో రక్త ప్రవాహాన్ని పునఃరుద్ధరించామన్నారు. మరో రోగికి రక్తనాళాల్లో క్యాల్షియం నిల్వలు పేరుకుపోయి తీవ్ర చాతినొప్పితో బాధపడుతుంటే గుండె బైపాస్ సర్జరీకి రోగి నిరాకరించిందన్నారు. రోటాబ్లేషన్, అధునాత ఇమేజింగ్ డైరెడ్ స్టంటింగ్‌తో విజయవంతంగా చికిత్స చేశామన్నారు. అంతర్జాతీయ నిపుణులు జపాన్ టయోహాసి హార్ట్‌సెంటర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మావోటో హబారా సహాయంతో ఆయన పర్యవేక్షణలో డాక్టర్ శివప్రసాద్, తాను కలిసి విజయవంతంగా గుండె ఆపరేషన్లు చేసి రోగుల ప్రాణాలు కాపాడామని డాక్టర్ హరిత వెల్లడించారు. సిమ్స్ శిఖర హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య పద్ధతులు, అంతర్జాతీయ వైద్యుల సహకారం అందుబాటులో ఉందని, గుండె జబ్బుల రోగులు తమ వద్ద ఉన్న వైద్య సౌకర్యాలు వినియోగించుకోవాలని కోరారు.

ఇన్నర్ రింగ్‌రోడ్డు పనుల్లో భాగంగా ఇళ్లు కూల్చివేత



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని స్వర్ణభారతీనగర్ నుంచి ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్–3 పనులకు సంబంధించి పనులు సోమవారం ప్రారంభించారు. సుమారు 200 పేదల ఇళ్లను కూల్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. న్యాయం చేయాలని పేదలు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో ఇదే కుటుంబాలకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే అవి కొంత దూరంలో ఉండటంతో కొందరు ఆ స్థలాలకు వెళ్లారు. మరికొందరు వెళ్లకుండా అక్కడే నివాసం ఉంటూ కూలీ నాలీ చేసుకుని జీవిస్తున్నారు. ప్రస్తుతం ఫేజ్– 3లో ఇళ్లు కోల్పోతున్న వారిలో రేకుల ఇళ్లకు నష్టపరిహారం, డాబా ఇల్లుకు తగిన నష్టపరిహారం అందజేయాలని కోరుతున్నారు.

సందేశాత్మకంగా కనకపుష్యరాగం నాటకం



కనకపుష్యరాగం నాటకంలో ఓ సన్నివేశం



దోగిపర్తి శంకరరావుకు వై.కె.నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కారంతో సత్కారం

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్, రీడింగ్ ఆవరణలో డాక్టర్ మురళీమోహన్ 52 ఏళ్ల కళా రంగ ప్రస్థానం, గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి, వైకే నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ నిర్వహిస్తున్న నాటకోత్సవాలు సోమవారం రెండో రోజుకి చేరాయి. వైకే నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావు, కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు, గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్, పొన్నూరు కళాపరిషత్ అధ్యక్షులు ఆంజనేయులు నాయుడు, నాయుడు గోపిలు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ నిర్వహణలో దివంగత రాఘవ రచించగా, ఎస్.కె. మిశ్రో దర్శకత్వం వహించిన దృశ్య వేదిక (విజయవాడ) వారి కనకపుష్యరాగం నాటకం సందేశాత్మకంగా కొనసాగింది. అనంతరం వైకే నాగేశ్వరరావు ఆత్మీయ పురస్కారాన్ని దోగిపర్తి శంకరరావుకు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జి.మల్లికార్జునరావు, డి.తిరుమలేశ్వరరావు, జానీబాషా, లంక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మస్తానయ్యకు సన్మానం



నగరంపాలెం: సామాజిక, ధార్మిక తత్పరత కలిగిన సీహెచ్ మస్తానయ్యను సత్కరించుకోవడం ఆనందదాయకమని సాహితీవేత్త ధనకుధరం సీతారామానుజాచార్యులు అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి కళారత్న(హంస) అవార్డు స్వీకరించిన ఆలయ కమిటీ అధ్యక్షులు మస్తానయ్యకు సోమవారం సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామానుజాచార్యులు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం, ప్రతిష్ట జరిగినప్పటి నుంచి ఉపాధ్యక్షులుగా, 2010 నుంచి అధ్యక్షులుగా కొనసాగుతున్నారని అన్నారు. అనంతరం చిమట రాఘవరావు (గొట్టిపాడు) సుందరకాండ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు.